## క్లుప్తంగా

### కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 12 మంది రోగులకు ఆపరేషన్లు నిర్వహించినట్లు కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్తా తెలిపారు. రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య, కడప, అనంతపురం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది కంటి రోగులకు పరీక్షలు చేశారు. అలానే 12 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్లు చేయించుకున్న 30 మంది ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నూరు అన్వర్‌బాషా, శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జీఎస్‌బి పవన్‌రెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాలమిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### మామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

రాయచోటి టౌన్ : మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని దీని కోసం మామిడి రైతులకు కిలోకు రూ.4ల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల ఎకరాలలో మామిడి సాగైందని చెప్పారు. మామిడి సాగు కోసం రైతులు అహర్నిశలు శ్రమించి పంటలు పండిస్తే చివరికి ధరలు లేక తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలానే మామిడికి మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపరచాలని, రవాణా సదుపాయాలు, నిల్వ గిడ్డంగులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### నల్లగంగమ్మకు పూజలు



భీజాక్షరాల రాయిని మొక్కుతున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. అనంతరం అమ్మవారి ఎదుట ఉన్న భీజాక్షరాలతో ఉన్న రాయిని మొక్కారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### కార్మికులపై ప్రభుత్వాల వివక్ష

రాయచోటి జగదాంబసెంటర్ : ఎనిమిది గంటల పనిదినం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్‌కిరణ్ అన్నారు. రాయచోటిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం అన్నమయ్య జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వివక్ష చూపడం తగదన్నారు. గతంలో కార్మికులు, కర్షకులు పోరాడి 8 గంటల పనిదినాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు.

### సంఘ సంస్కర్త గురజాడ ఆదర్శప్రాయుడు



గురుజాడకు నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

రాజంపేట రూరల్ : సంఘ సంస్కరణకు, బాషా సేవకు అహర్నిశలు కృషి చేసిన మహాకవి గురుజాడ వెంకట అప్పారావు ఆదర్శప్రాయుడని తెలుగుభాష సంస్కరణ సమితి జిల్లా కార్యదర్శి కాకర్ల రాముడు అన్నారు. స్థానిక జౌళీ బజారులోని సరస్వతీ విద్యామందిరంలో ఆదివారం గురుజాడ జయంతి వేడుకలను భాషా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముందుగా గురుజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాకర్ల రాముడు మాట్లాడుతూ నాటి సమాజంలో బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి సామాజిక సమస్యలను తన కలం ద్వారా చక్కటి రచనలతో ప్రజలకు తెలియజేసి సామాజిక మార్పునకు విశేషంగా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు.

### ఇరుగులమ్మా.. కరుణించమ్మా



పూజలందుకున్న ఇరుగులమ్మ

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని మూలపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీ ఇరుగులమ్మకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ‘ఆయుష్’లో మందులు లేవు!

- మూడేళ్లుగా సరఫరా కాని మాత్రలు
- బయట కొనుగోలు చేసి రోగులకు ఇస్తున్న వైనం
- మందులు లేనప్పుడు వైద్య కేంద్రం ఎందుకంటూ స్థానికుల ప్రశ్న

**ఆయుష్ చికిత్స అనేది సాంప్రదాయ భారతీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ. ఇందులో ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి పద్ధతులు ఉంటాయి. ఈ చికిత్స శరీర రోగనిరోధక శక్తిని పెంచడం, దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడం, మానసిక ప్రశాంతతను అందించడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటాయి. ఈ చికిత్స కోసం వాడే మందుల ద్వారా మానవ శరీరానికి ఎలాంటి దుష్ప్రభావాలు కలగవు. అలాంటి ఉన్నతమైన వైద్యాన్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. కనీసం రోగాలతో ఆయుష్ కేంద్రాలకు వచ్చే ప్రజల కోసం అందించేందుకు మందులు కూడా కరువు అయ్యాయి. మందులు కొరతతో నడుస్తున్న ఒంటిమిట్టు ఆయుష్ విభాగంపై కథనం.**

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో ఆయుష్ వైద్య కేంద్రం ఉంది. ఆ కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా అక్కడికి వచ్చే రోగులకు ఇచ్చేందుకు రాష్ట్ర



ఆయుష్ కేంద్రంలో మందులు లేక బోసిపోయిన ఔషధాల ర్యాక్

ప్రభుత్వం మందులను సరఫరా చేయలేదు. చికిత్సకు మందులు లేకపోవడంతో చేసేదేమీ లేక రోగులు అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగుల ఆరోగ్య సమస్యలను మెరుగు పరిచేందుకు ఆయుష్ వైద్యం మందులు ఎంతగానో ఉపయోగపడతాయి. అలాంటి దుష్ప్రభావాలు చూపని మందులు ఎక్కడ ? అని ఒంటిమిట్ట మండల ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

**మందులు లేక బయట కొనుగోలు**

మూడు సంవత్సరాలుగా ఒంటిమిట్ట ఆయుష్ కేంద్రానికి ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోవడంతో ఆయుష్ వైద్య కేంద్రంలోని వైద్యులు తమ సొంత ఖర్చులతో 4 రకాల మందులను బయట కొనుగోలు చేసే దుస్థితి ఏర్పడింది. ఒకటి కాదు రెండు కాదు మూడు సంవత్సరాలుగా ఒంటిమిట్ట ఆయుష్ వైద్య కేంద్రానికి ప్రభుత్వం మందులు సరఫరా చేయకుంటే అక్కడ ఆయుష్ వైద్యులను, ప్రత్యేక ఆయుష్ కేంద్రాన్ని ఎలా నడుపుతోందని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఆయుష్ మందులు ఎంతో అవసరం..**

ప్రస్తుతం సమాజంలో ఉన్న జీవనశైలి ప్రకారం ఇప్పుడు ప్రజలకు ఆయుష్ కేంద్రాలలో అన్ని రకాల వైద్యం అందించాల్సిన అవసరం ఉంది. ఆయుష్‌లోని ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య పద్ధతులు మనిషి జీవనశైలి మెరుగుపడి, వారి శరీరంలోని దీర్ఘకాలిక రోగాలను తగ్గిస్తాయి. అలాంటి వైద్యానికి ప్రభుత్వం మందులు సరఫరా చేసి, ప్రోత్సహించకుండా పూర్తిగా నిర్వీర్యం చేసే లాగా పట్టీ పట్టనట్టు ఉండటం పలు విమర్శలకు దారితీస్తుంది.

**ఆయుష్ చికిత్సల ప్రయోజనాలు**

- సమగ్రమైన ఆరోగ్యం: ఈ చికిత్స కేవలం వ్యాధి లక్షణాలకే కాకుండా, మొత్తం శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తాయి.
- సహజమైన చికిత్సలు: ఆయుష్ పద్ధతులు.. సహజ సిద్ధమైన ఔషధాలు, ఆహార మార్పులు, జీవనశైలి మార్పులపై ఆధారపడి ఉంటాయి.
- దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణ: ఆయుర్వేదం, యోగా వంటివి దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించడానికి సహాయపడతాయి.
- మానసిక ప్రశాంతత: యోగా, ధ్యానం వంటి పద్ధతులు ఒత్తిడిని తగ్గించి, మానసిక ప్రశాంతతను పెంపొందించడంలో తోడ్పడతాయి.

**మూడు సంవత్సరాలుగా మందులు రాలేదు**



2022 నవంబర్ నుంచి ఇప్పటి వరకు ఒంటిమిట్ట ఆయుష్ వైద్య కేంద్రానికి ప్రభుత్వం నుంచి మందులు రావడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. మందులు వచ్చేంత వరకు కొన్ని రకాల మందులను బయట నుంచి తెప్పించి ఇక్కడికి వచ్చే రోగులకు వారివారి ఆరోగ్య సమస్యలకు సంబంధించి మందులు ఉంటే వాటిని మాత్రమే ఇచ్చి పంపుతున్నాం.

– డాక్టర్ నసీమున్నిషా, బీయూఎంఎస్, ఆయుష్ కేంద్ర వైద్యాధికారి, ఒంటిమిట్ట

**సరఫరా చేయాలి**



పూర్వీకులకు గతంలో అందించే సాంప్రదాయ వైద్యంలోని పలు రకాల వైద్య సేవలు ఉన్న ఆయుష్ లాంటి వైద్య కేంద్రానికి రోగుల సమస్యలను పరిష్కరించుటకు మందులు సరఫరా చేయాలి. ఎలాంటి దుష్ప్రభావాలు లేని ఈ మందులను సమాజంలో నిత్యం అందుబాటులో ఉంచాలి.

– జాకీర్ హుసేన్ , స్థానికుడు, ఒంటిమిట్ట గ్రామం, ఒంటిమిట్ట మండలం

**వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తాం**

గత మూడు సంవత్సరాలుగా మందులు లేకపోవడం నిజమే, ప్రభుత్వం నుంచి సరఫరా కావడంలేదు. ప్రస్తుతం మందులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం తమకు నిధులను అందించింది. ఒక వారం రోజుల్లో ఒంటిమిట్ట ఆయుష్ వైద్య కేంద్రానికి మందులు సరఫరా చేస్తాం.

– డాక్టర్ ఎం. శేఖర్‌రాజు, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఆయుష్ విభాగం, కడప

## వంతెన నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం

- కొట్టుకుపోయిన ఓబిలి గ్రామ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే, ఎంపీపీ
- ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే చేపట్టాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈకి సూచన



వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, ఎంపీపీ మేడా

నందలూరు : మండలంలోని టంగుటూరు వద్ద చెయ్యేరు నదిలో ప్రవహిస్తున్న నీటి వల్ల టంగుటూరు – ఓబిలి మధ్య రోడ్డు కొట్టుకుపోవడంతో ఆదివారం రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టంగుటూరు – ఓబిలి మధ్య ఉన్నటువంటి రహదారి కొట్టుకుపోవడంతో రెండు మండలాల ప్రజల ప్రయాణాలకు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఆర్ అండ్ బీ ఎస్ఈతో ఫోన్‌లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో 2012లో తన సొంత నిధులతో రోడ్డు మొదటిగా ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ తర్వాత మళ్లీ రూ.25 లక్షల నిధులతో తూములు ఏర్పాటు చేసి రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు మళ్లీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుని పోయి వెంటనే శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలని తెలియజేశారు. అవసరమైతే రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో రోడ్డు నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, భాస్కర్‌యాదవ్, షేక్ షావలీ, మంచ మురహరి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, టంగుటూరు మాజీ సర్పంచ్ గంగినాయుడు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, చింతకాయల శంకర, వెంకటయ్య, ఎంపీటీసీ సోమిశెట్టి ప్రభాకర, ఓర్సు శ్రీను, నర్సారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఉపసర్పంచ ఇబ్బు, మాబాషా, పెనుబాల నాగసుబ్బయ్య, ముమ్మడిశెట్టి సుధాకర్, కళ్యాణ్‌రెడ్డి, లేబాక ఎల్లయ్య, నాగి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## పీపీపీతో సర్కార్‌కు వేల కోట్లు నష్టం



మాట్లాడుతున్న విజయభాస్కర్

రాయచోటి జగదాంబసెంటర్ : పీపీపీ అంటూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్న ప్రభుత్వం తీరు కారణంగా ఏటా వేల కోట్ల రూపాయలు నష్టం వస్తుందని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన మెడికల్ కాలేజీలు ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. అలానే ఇప్పటివరకు ప్రభుత్వం వెచ్చించిన వేల కోట్లు ప్రైవేటుకు లాభం చేకూర్చే విధంగా.. ప్రభుత్వ ఖజానాకు నష్టం చేసినట్టు అవుతుందని తెలియపరిచారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బసవరాజ్, కడప జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు శివరాంయాదవ్ పాల్గొన్నారు.

## కూటమి దుశ్చర్యలను ముక్తకంఠంతో ఖండించాలి



మిరియాల సురేఖ

రాజంపేట : రాష్ట్ర పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసిన కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని రాజంపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ పేర్కొన్నారు. ఆదివారం తన స్వగృహంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అత్త సొమ్మును అల్లుడు దానం చేసినట్లుగా జగనన్న తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులు, తన బినామీలకు అప్పజెప్పేలా తీసుకొచ్చిన నిర్ణయాలు పేద విద్యార్థులకు శాపంగా మారాయన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బృహత్ సంకల్పంతో ఏర్పాటు చేయాలనుకున్న మెడికల్ కాలేజీలను, సీఎం అయ్యాక చంద్రబాబు తూట్లు పొడిచారన్నారు. వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందన్న అక్కసుతో ప్రైవేటు పరం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ దుశ్చర్యలను ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ప్రజా ఉద్యమానికి దారితీసే పరిస్థితులు నేడు రాష్ట్రంలో నెలకొన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పీపీపీ విషయంలో వెనక్కి తగ్గకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- రాజంపేటలో అంగరంగా వైభవంగా ఉత్సవాలు
- ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గ్రందే సత్యనారాయణగుప్తా



శ్రీ మత్కన్యకా పరమేశ్వరీ

రాజంపేట రూరల్ : అమ్మవారిశాలలో కొలువైవున్న మత్కన్యకా పరమేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను 22 నుంచి 03వ తేదీ వరకు అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గ్రందే సత్యనారాయణగుప్తా, ఉపాధ్యక్షులు దోర్నాల వెంకటేశ్, సనిశెట్టి రమేష్‌బాబు, కార్యదర్శి పత్తి నాగరాజులు తెలియజేశారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలును ఆదివారం వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి పూజాధికాలు ప్రారంభమవుతాయన్నారు. సోమవారం పతాకావిష్కరణ గావించి కార్యక్రమాలు ప్రారంభించనున్నామన్నారు. సోమవారం దీక్షాబంధన, 23న బిల్వవృక్ష, 24న అన్నపూర్ణదేవి, 25న శ్రీకృష్ణమూర్తి, 26న మోహినీదేవి, 27న , 28న గాయత్రీదేవి, 29న సరస్వతీదేవి, 30న మహిషాసురమర్దిని, 01న శ్రీమహాలక్ష్మీ, 02న రాజ రాజేశ్వరీదేవి అలంకారాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నారని తెలియజేశారు. 02వ తేదీ రాత్రి పార్వేట ఉత్సవం బాణసంచా పేలుళ్లతో రావణదహన కార్యక్రమాన్ని పాతబస్టాండ్ కూడలిలో కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. 03వ తేదీ ఊంజల్ సేవతో శరన్నవరాత్రులు ముగుస్తాయని తెలియజేశారు. ఈ నెల 29న బిందె సేవ, విజయదశమి రోజున ప్రత్యేక సాంస్కృతిక వేడుకలతో పాటు మహా నవమి రోజున గుండప్రవేశం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

**నందలూరులో..**



విద్యుత్ దీప కాంతులలో ఆలయం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం దేవీ నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ఒక్కో రోజు ఒక్కో అలంకారంలో కన్యకా పరమేశ్వరీదేవి దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు మాకం వెంకటకుమార్, చలపతి నరసింహ, కార్యదర్శి సురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శి ఎంబలూరు నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనా వైఫల్యాలను ఎండగడతాం



రియాజ్ రెహమాన్

రాయచోటి : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగడతామని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శి రియాజ్ రెహమాన్ అన్నారు. ఆదివారం రాయచోటిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైద్య విద్య ప్రైవేటీకరణ, రెడ్‌బుక్ రాజ్యాంగం, ప్రజలపై జరుగుతున్న దాడుల విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిల ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలో పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలపై పోరాటాలు చేపడతామన్నారు. రాయచోటిలో వర్షాలు కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ పాఠశాలలకు అక్టోబర్ 2 వరకు దశరా సెలవులు ప్రకటించినట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు. ప్రభుత్వ నిభంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ స్పష్టం చేశారు.

## ఓ వైపు సంతోషం.. మరో వైపు ఆందోళన



నిండుకుండలా పింఛా ప్రాజెక్టు

సుండుపల్లె : గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీలోని ఎర్రప్పరెడ్డి ఆదినారాయణరెడ్డి జలాశయం (పింఛా ప్రాజెక్టు), ఝరికోన ప్రాజెక్టు మొరవతో పాటు బహుదా నది వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని నారాయణరెడ్డి చెరువు, కొత్తచెరువు, కృష్ణారెడ్డి చెరువు, రెడ్ల చెరువు, ఊట చెరువు, గుర్రప్పచెరువు, రాతిచెరువు, పెద్దచెరువు, అప్పన్నకుంట మండల కేంద్రంలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారి నీరు బయటకు పారుపోతున్నాయి. ఇదిలా ఉంటే 2020 నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పింఛా ప్రాజెక్టు తెగిపోవడంతో అప్పటి ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ సహకారంతో పనులు ప్రారంభించి 2024 నాటికల్లా పూర్తి చేశారు. అయ్యవారి చెరువుకు తాత్కాలికంగా రింగుబండ (మట్టికట్ట)ను ఏర్పాటు చేశారు. అయితే గత నాలుగు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి కట్ట కొట్టుకుపోయి ఆ ప్రాంత ఆయకట్టు రైతులకు నిరాశను మిగిల్చింది. బైరాన్‌చెరువుకు మొరవ లేక భారీ వర్షాలకు వరదనీరు మొత్తం దిగువన ఉన్న పత్తివాండ్లపల్లె ఇళ్లలోకి చేరడంతో గ్రామంలోని ప్రజలు అర్ధరాత్రి భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి తెగిన చెరువులకు రక్షణ చర్యల కల్పనకు చేయాల్సిన పనుల ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి తెగిపోయిన చెరువులను మరమ్మతులను చేయించి రైతులను ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇసుక బస్తాలను వేసి నీటిని నిలువ చేయాలని కోరుతున్నారు. లేకుంటే రాబోవు రోజుల్లో వందల ఎకరాలు బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు విరివిగా కురిశాయని ఆనంద పడాలో చెరువులు తెగిపోయాయని బాధపడాలో అర్థం కాని స్థితిలో రైతాంగం ఉంటోంది.

# జ్వరం.. కలవరం

- పల్లెల్లో విష జ్వరాలు
- పట్టణాలకు పరుగులు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు



జ్వరంతో మంచానపడ్డ మహిళ



వైకోట ఆరోగ్య కేంద్రం వద్ద పారిశుద్ధ్య దుస్థితి

ఓబులవారిపల్లె : ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుద్ధ్య లోపంతో.. దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు ప్రబలాయి. దాదాపు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటికి ఒకరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

**ప్రబలుతున్న విష జ్వరాలు**

దోమలు, వాతావరణ మార్పులు, తాగునీటి కలుషితం, కాలుష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. రైల్వేకోడూరు పట్టణంలోని ధర్మాపురం, శెట్టిగుంట, అనంతరాజుపేట గ్రామాల్లో విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఓబులవారిపల్లె మండలంలోని వైకోట, ఓబులవారిపల్లి, గాదెల, చిన్నఓరంపాడు, ముక్కవారిపల్లి, కొర్లకుంట, సంజీవపురం గ్రామాల్లోనూ జ్వరాలు బెంబేలెత్తిస్తున్నాయి. వైకోట గ్రామంలో ఇంటికి ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. పెనగలూరు మండల కేంద్రంలో సిద్దవరం, ఈటమాపురం తదితర గ్రామాల్లో విష జ్వరాలు విజృంభించాయి. దీంతో రోగులు పెనగలూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో బారులు తీరుతున్నారు. అలాగే రాజంపేట పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇటీవలే వైకోట గ్రామంలో చందనశ్రీ అనే ఎనిమిదేళ్ల చిన్నారి విషజ్వరంతో మృతి చెందింది. మెరుగైన వైద్యం అందకపోవడంతో చిన్నారి మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**చెత్తా చెదారంతో..**

నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. ఆ చెత్త కుళ్లి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మరికొన్ని చోట్ల తాగునీరు కలుషితం కావడంతో రోగాల బారిన పడుతున్నారు. టైపాయిడ్ జ్వరంతో ఎక్కువగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాలలో పర్యటించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న ప్రజలకు మెడికల్ క్యాంపులు ద్వారా వైద్య సేవలు అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



జ్వర పీడితులతో కిక్కిరిసిన వైకోట ఆరోగ్య కేంద్రం



ఓబులవారిపల్లె మండల కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న పందులు

**ఇంట్లో నలుగురికి జ్వరం**



మా ఇంట్లో నాతోపాటు నా భార్య, కుమార్తె, కొడుకు జ్వరంతో బాధపడుతున్నాం. చిన్నపాప చేతికి ఇంజెక్షన్లు వేసే క్యాన్ తగిలించుకునే స్కూలుకు వెళ్తుంది. ప్రతి ఇంటిలో జ్వరంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– హరి, రైతు, వైకోట, ఓబులవారిపల్లి

**దోమల నివారణ చేపట్టండి**



గ్రామంలో చెత్తా చెదారం తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. వైద్యులు గ్రామంలో క్యాంపు ఏర్పాటు చేసి జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, మందులు ఇవ్వాలి. లేకుంటే జ్వరాల సంఖ్య పెరిగిపోతుంది. సీజనల్ వ్యాధులపై అధికారులు దృష్టి సారించాలి

– రామకృష్ణయ్య, మాజీ ఎంపీపీ, గాదెల, ఓబులవారిపల్లె

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం**



వర్షాల కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామంలో ప్రతి ఇంటికీ దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తున్నాం. మురికినీటి కాలువలలో అబెట్ ద్రావణం ద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా చూస్తున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి మందులు, రక్త పరీక్షలు చేస్తున్నాం.

– నవీన్, వైద్యులు, వైకోట, ఓబులవారిపల్లె

## రక్తదాన శిబిరానికి స్పందన



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

పుల్లంపేట : విశ్వహిందూ పరిషత్,భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా సేవా సప్తాహంలో భాగంగా ఆదివారం పుల్లంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు అయోధ్య రామ జన్మభూమి కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బలిదానం అయిన వారిని గుర్తించుకుంటూ 86 మందితో కడప రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పోకల ప్రభాకర్, జిల్లా సంపర్క్ ప్రముఖ్ వేలూరు నరసింహ కుమార్, రిటైర్డ్ లెక్చరర్ సాదు సుబ్బరాయుడు, ములక్కాల పెంచల్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు మనోహర్ రెడ్డిలు తమవంతు కృషి చేశారు. రక్తదాతలకు చొప్పా ట్రావెల్స్ అధినేత రాజారెడ్డి పండ్లు, జ్యూస్, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో మామిళ్ల రమణ, అవ్వారు జగదీష్, శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.